**ప్రతి రోజూ లాగ** ఆ రోజూ తెల్లవారింది.

తెల్లవారటమనేది అందరికీ ఒకే మాదిరిగా ఉండదు. కొందరికి సూర్యుని రాకతో తెల్లవారినట్లు, మరికొందరికి ఆకాశవాణి తెలుగు వార్తల రాకతో తెల్లవారినట్లు. కొందరు తొమ్మిది గంటల ఉదయ కాలం బద్ధకంగా మంచం మీద నుండి లేస్తే, మరి కొందరికి పగటి కాలం సగం గడిస్తేనే కాని తెల్లవారదు.

చీకటిని మింగి తూర్పున లే వెలుగు రేఖల రాక తెల్లవారటానికి సూచన. అది పక్షులు నిద్ర మేల్కొనే వేళ. కాని, వెలుగు రాక, చీకటి పోక, చుక్కలు ఆకాశంలో బిక్కుబిక్కుమంటూంటే, ఆ చీకటి వేళను తెల్లవారిన వేళ అని ఎవరనగలరు?

కాని, గన్నిగా డంటాడు — అదే వాడికి తెల్లవారిన వేళ అని.

వేగుచుక్క పొడవక ముందే నిద్ర లేస్తాడు వాడు. అక్కడినుండే ప్రారంభమవుతుంది వాడి దిన చర్య!

లేనిదానిని సాధించుకోవటం కోసం ఆరాటం కొందరి కయితే, ఉన్నదానిని పెంపొందించుకోవటం కోసం పోరాటం మరి కొందరికి.

ఆ ఆరాట పోరాటాలతోనే రోజు ప్రారంభమవుతుంది. యోజనాల కొలది పయనించి తేనెను సేకరించి తెచ్చే శ్రామిక తేనెటీగలు కొన్ని అయితే, హాయిగా ఆ తేనెనే తిని మరిగే పోతుటీగలు మరికొన్ని. ఆ పోతుటీగల్ని పోషించే రాణి ఈగ ఉన్న ఆ గూటిలో, ఆ పోతుటీగల్ని ఎదిరించలేని శ్రామిక ఈగలున్న అదే గూటిలో గన్నిగాడూ ఒక సభ్యుడే.

గన్నిగాడు ఉద్యోగంలో చేరే నాటికి వాడి వయసు ఏడు. ఇప్పుడు వాడి వయసు పది.

ఉద్యోగంలో చేరేనాటికి వాడికే ధ్యేయాలూ లేవు. ఏ ఆదర్శాలూ లేవు. ఉద్యోగంలో వా డెందుకు చేరాలో వాడికి తెలియదు. ఉద్యోగంలో చేరేనాటికి వాడు దేనిని త్యాగం చేయవలసి వచ్చిందో వాడికి తెలియదు. కాని, మనసులో వ్యక్తమైన ఒక వేదన— పలకా బలపం, చిరిగిపోయిన పుస్తకం కనిపించినప్పుడు మాత్రం లీలగా వాడిలో కదలక పోలేదు.

కంచె అవతల ఉన్న బడిలోకి కాఫీ, టీలు తీసుకు వెళ్ళినప్పుడు మాత్రం క్రమక్రమంగా వాడిలో తాను పోగొట్టుకున్న దేమిటో తెలియరాక తప్పలేదు. జ్ఞానోదయమైన ఆ సందర్భంలో వాడి నెవరు రక్షించ గలరో వాడికి తెలియదు. అప్పటికే వాడు చదువుకు స్వస్తి చెప్పి మూడు సంవత్సరా లయింది. ఆ స్థిరంలేని ఉద్యోగంలో చేరి అంతే కాలమూ అయింది. ఇప్పుడు ఎటూ పోలేని పరిస్థితి.

ఉలిక్కిపడి నిద్ర లేస్తాడు. తలుపుగా ఉన్న తడిక సందులోంచి చీకటిని, నక్షత్రాలను చూస్తాడు— ప్రతి రాత్రి కనీసం రెండు పర్యాయాలయినా. వెలుగు వచ్చి వాడు నిద్రనుండి లేస్తే ఆ నాడే వాడి ఉద్యోగం గంగలో కలుస్తుంది. పేడ అలికిన ఆ నేల మీద నుండి చురుకుగా లేచి, రెండు మడతల గోనె పట్టాను నాలుగు మడతలు చేసి, చిరుగుల దుప్పటి అందులో చుట్టి, ఒక మూలగా ఉన్న పాకేజి డొక్కు పైన జాగ్రత్తగా పెట్టుకుంటాడు. బరక చీపురు అందుకుని నేల అంతా బరబరా తుడిచేస్తాడు. పొడుగాటి బల్లలు మూడింటిని మూడు వైపుల సర్దుతాడు. తలుపును పక్కకు తోసి, వీధి తుడిచి, మరొక బల్లను వీధిలో వడేస్తాడు, రెండు ముంతల నీళ్ళు చల్లి, నాలుగు కర్రలు పడేసి, రెండు పిడక ముక్కలు పడేసి, మరి నాలుగు చితుకులు పడేసి, పొయ్యి ముట్టించి, రెండవ పొయ్యికి నిప్పు సప్లయి చేస్తాడు. ఒక పొయ్యి మీద సిల్వరు డేకిసాలో నీళ్ళు పడేస్తాడు. మరో పొయ్యి మీద నీళ్ళు పోసిన ఇడ్లీ పాత్ర పడేస్తాడు. మూడు ఇడ్లీ ప్లేట్లలో ఇడ్లీలు సర్ది మూత పెట్టేసి ( ఆ ఇడ్లీ పిండిని అంతకు ముందు సాయంత్రం వాడే రుబ్బుతాడు ), గోధుమ పిండిలో కసింత ఉప్పు, మరి కసిన్నికి కసిన్ని నీళ్ళు కలిపి ముద్దచేసి, సిల్వర్ బేసిన్‌లో ఉంచి మూతేసి, "బాబూ! లెగుస్తావా?" అని రెండు, మూడుసార్లు తడకమీద తట్టుతూ పిలుస్తాడు గన్నిగాడు. అప్పల్రాముడు అయిదవసారి బద్ధకంగా ఆవలించి, ఆరవ సారి పెళ్ళాన్ని కౌగిలించుకొని, 'కాఫీ అయినంక లెగుద్దువులే' అని చెప్పి, మరింకేదో చెవిలో గుసగుస లాడి మంచం దిగుతాడు. అతడు పలుదోముపుల్ల నోట్లో పెట్టుకుని వచ్చేసరికి ఉల్లిపాయ ముక్కలు, బంగాళా దుంప ముక్కలు సన్నగా తరుగుతూంటాడు గన్నిగాడు.

"నీళ్ళు మరిగినయా?" ఉరుముతాడు అప్పల్రాముడు.

"మరుగుతున్నయి" అంటాడు ఉల్లిపాయల వైపు నుండి దృష్టిని తప్పించుకుని కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ.

"నీళ్ళెట్టు" అంటాడు వీధిలో ఉన్న బల్లమీద గొంతు కూర్చుంటూ.

ముంతతో వేడినీళ్ళు పెట్టి, "నాను పాల కెల్తన్నగాని ఇడ్లీ సూసుకో. పూరీ పిండి కలిపిన. కూర ముక్కలు ఆడుండయి. పాలెక్కువ ఇమ్మని సెప్పమంతా వేటి?" అని అడుగుతాడు.

"నివ్వు పాల కెళ్ళాకుయ్యా! ఎగ్రా కావాలో నేదో నేను చూసుకోగల్ను. గోవరాజుగా డ్నొపాలి రమ్మని సెప్పు" అంటాడు. గోవరాజు వస్తే ఎక్కువ కావలసిన పాల సంగతి వాడితో ముచ్చటిస్తూ, ప్రొద్దుట పోసిన పాలు చిక్కగా లేవని అధారిటీ చేస్తూ తిడతాడు, గల్లాపెట్టె ముందు కూర్చున్న పెళ్ళాం చుక్కకు వినపడేటట్టు. ఇది ప్రతి రోజూ జరిగే పనే. అయినా, ఎక్స్ట్రా పాలకోసం గన్నిగాడు అడుగక తప్పదు. గోవరాజు రావటం ఏమాత్రం ఆలస్య మయినా గన్నిగాడికి అక్షింతలు తప్పవు. ఆ విషయం వాడి కెలాగూ తెలుసు.

పాలకోసం గోవరాజింటికి పరుగెత్తుతూ చింత చెట్టు క్రింద నిద్రపోతున్న బస్సులోకి టైరు మీద నుండి ఎక్కి తొంగి చూచి, 'డ్రైవరు అప్పల్స్వాం గారో! లెగాల—తెల్లారి పోనాది' అంటూ డ్రైవరు అప్పలస్వామిని మన్నిస్తూ నిద్ర లేపుతూ, 'సెలపతీ! నిద్ర లెగూ!' అంటూ క్లీనరు చలపతిని చనువు మీద నిద్ర లేపుతాడు.


"నువ్వొస్తే గాని సూర్యుడయినా నిద్ర లేవడ్రా, గన్నిగా! టిఫిన్ రెడీ అయిందిరా?" అడుగుతాడు బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని లేస్తూ అప్పలస్వామి.

"అవుతంది. నాను పాల కెల్తన్న. ముకాలు కడుక్కుని, బేగి టిపిని కొచ్చిండి" అంటూ పరుగెత్తుతాడు.

పంతులుగారి వీధిలోకి వచ్చేసరికి ఆయన ఇంటి అరుగుమీద దుప్పట్లలో ముడుచుకు పడుకున్న పిల్లలు కనిపిస్తారు.

"మురళిగారో! చంద్రంగారూ! అందరూ నిద్ర లెగండి. పరిచ్చలు దగ్గరికొస్తున్నయి... లెగండి... లెగండి... మాటగారో!... మీ పిల్లలు లెగలేదండి! చదవటంనేదు" అంటూ ఒక గావుకేక వేసి, చనువు





# తెల్లవారింది

- ఊర్వశి

తీసుకుని ఒకరిద్దరి ముఖాల మీద దుప్పటు లాగేసి ఆగకుండా ముందుకు పరుగెడుతాడు. వీధి చివర అరుగు మీద పళ్ళుతోముకుంటున్న పూజారయ్య కనిపిస్తాడు. పరుగెడుతున్న వాడల్లా ఆ ఇంటి ముందుకు వచ్చేసరికి ఆగి, "నమస్కారమండీ!" అంటాడు రెండు చేతులూ జోడించి తల వంచి.

"శుభమస్తు!" అంటూ దాయన తను చేస్తున్న పని ఆపి.

అప్పటికి చుక్కలు ఆకాశంలో అదృశ్యమవు తుంటాయి.

పరుగెడుతూ గోవరా జింటి ముందుకు చేరతాడు. అప్పటికి గోవరాజు పాలు పితకటానికి సన్నద్ధుడవు తూనో, లేక పాలను మెరిసే చిన్న ఇత్తడి కూజా బిందె లోకి సిద్ధపరిచో గన్నిగాడికోసం ఎదురు చూస్తూం టాడు. నెత్తిమీద సొమ్మంచి ఇత్తడి బిందెను నెమ్మదిగా తల మీద ఉంచి, "జాగర్త" అంటూ భుజం తట్టి పంపిస్తాడు గోవరాజు. గన్నిగాడు మరీ పసివాడుగా ఉన్నప్పుడు గోవరాజే పాలు చిక్కంలో పెట్టుకుని తెచ్చేవాడు. అతడి పాల వ్యాపారం పెరిగింది. అప్పటి నుండి అది వీలుపడలేదు. కొన్ని రోజులు ఊర్మిళ పెట్టుకు వచ్చేది. అప్పలాముడు నిద్రలేవని పెళ్ళానికి వినిపించకుండా చంద్రితో హాస్యాలాడటం ప్రారంభించాడు. అంతటితో ఆ పిల్ల అటువక్కకు రావటం మానుకుంది.

అమ్మవారి ఘటాన్ని తలమీ దుంచుకున్నంత పదిలంగా పట్టుకుని జాగ్రత్తగా అడుగులు వేస్తూ దారిలో కనిపించిన వాళ్ళను పలకరిస్తూ హోటలు ముందుకు చేరతాడు. అప్పటికే ఆలస్యం అయిపోయిందని కారాలు మిరియాలు నూరుతూం టాడు అప్పలాముడు. పాలబిందె అందుకుంటూ పళ్ళు తోముకోవటానికి వాడికి అనుమతి ఇస్తాడు. సావాను గదిలో ఒక మూల ఇరకలో ఉంచుకున్న కానుపుల్ల అందుకొని అక్కడికి సమీపంలో ఉన్న చెరువు వైపు పరుగెత్తుతాడు.

వాడు వచ్చేసరికి అప్పలాముడు భార్యకు కాఫీ రెడీ చేసి, గాజు గ్లాసులో పోసి, తనొక గ్లాసందుకొని, భార్య కొక గ్లాసిచ్చి, టీని సిల్వర్ గ్లాసులో పోసి గన్నిగాడికోసం ఎదురు చూస్తుంటాడు అప్పలా ముడు ఎదురుగా చేతుల కుర్చీలో రెండు కాళ్ళు పెట్టుకుని కూర్చుని, "ఇంత త్వరగా తెల్లవారిం దేవా!" అని విసుక్కుంటూ. పలుసార్లు ఆవలిస్తూ, చెవి తమ్మెట్లో చిక్కుకు పోయిన జుత్తు సవరించు కుంటూ, కొప్పులోంచి జారిపోయే పూదండను సరిచేసుకుంటూ, కాఫీని చుక్క చప్పరించే వేళ తడి బట్టలతో చెరువులో మునిగి వచ్చిన గన్నిగాడు ఆ గది

లోనే ఒక పక్కగా పోయి సిగ్గెరగక పాడి లాగు, పాడి చొక్కా తొడుక్కుంటూంటే సిగ్గు పడిపోతుంది చుక్క. "సిగ్గు లేనోడా!" అని విసుక్కుంటూ. అలా రోజుకు కొన్ని సార్లయినా విసుక్కుంటుం దామె.

లాగు, చొక్కాలు తడక మీద ఒక పక్కగా ఆరేసుకుని, టీ గడగడా తాగేసి పూరీ బల్ల ముందు కూర్చుంటాడు. తల మీద నుండి నీరు కారుతున్నా లెక్క పెట్టక పూరీలు వత్తుతూ, "ఈ పూరీ అన్నీ ఇయాళ సెల్లిపోవాల. మద్దేన్నం నాటికి మళ్ళా పిండి కల్పాల. సంతరోజులా టిఫినీ, కాఫీ, టీ సెల్లిపోవాల" అని పూహాగానాలు చేస్తూం టాడు గన్నిగాడు. వ్యాపారం పెరిగినవాడు వాడికి ఒరిగిన లాభమేమిటో, బేరాలు తగ్గిన నాడు వచ్చిన నష్టమేమిటో వాడికి తెలియదు. నిజానికి వాడి జీతం ఎంతో వాడి తండ్రికీ తెలియదు, వాడికీ తెలియదు.

ఇక్కడ దింపి మూకుడెక్కిస్తాడు పొయ్యి మీదికి అప్పలాముడు. పూరీలు రెండు, మూడు వాయిలు దిగేసరికి అప్పలస్వామి బస్సును హోటలు ముందుకు తెచ్చి ఆపుతాడు. చుక్క గల్లా పెట్టె దగ్గరికి తప్ప పొయ్యి ముందుకు రాదు. హోటలుకు వచ్చే మగవాళ్ళు ముందు అందరూ చూస్తూంటే పొయ్యి ముందు కూర్చోటమంటే చుక్కకు నామోషి. అప్పలాముడు టిఫిన్ సర్వు చెయ్యటానికి పరుగెడతాడు. గన్నిగాడు మూకుడు దగ్గరికి పరుగెడతాడు. గన్నిగాడు పూరీలు వత్తుతూనే, పూరీలు వేయిస్తూనే అప్పలాము డిచ్చే ఆజ్ఞల నందుకుంటూంటాడు. బస్సు స్టాపు టిఫిన్ చేస్తూంటే బస్సుకు వెళ్ళే జనం, కాఫీ టిఫిన్ కోసం వచ్చే జనం, రాత్రి టౌన్‌లో జరిగిన విశేషా లేమిటో తెలుసుకోవాలనుకొనే జనం, రాత్రి తమకు తెలియకుండా ఏ వీధిలో, ఏ ఇంటిలో ఏ విశేషం జరిగిందో తెలుసుకొనగోరే జనం, విశేషాలను తెలియ జెప్పే జనం, కబుర్లు చెప్పి అప్పలాముడి దగ్గర ఆ పూటకు కాతా చెప్పి ఆ పొద్దు గడుపుకునే జనం, చుక్క అందంగా అనిపిస్తే చూడాలని వచ్చే నాగరిక జనం-వీళ్ళందరితో హోటల్లో రద్దీ ఎక్కువ అవుతుంది. అప్పలాముడికి ఊపిరి తిరగదు. గన్నిగాడు టిఫిన్లు అందిస్తూ, మంచి నీళ్ళ గ్లాసు లందిస్తూ, ఖాళీ అయిన ప్లేట్లను తీసేస్తూ, గ్లాసుల ప్లేట్లను కడిగి తెస్తూ సవ్య సాచిలా అన్ని దిక్కులా చొచ్చుకు పోతూంటాడు. పెద్దమనుషులకు, బట్టలు నలగని బాబులకు అప్పలాముడే మర్యాదగా సప్లయి చేస్తాడు. ఆ క్షణంలో గన్నిగాడు క్లీనరు మాత్రమే.

"ఇంకో మనిషిని పెట్టుకోకూడదా, అప్పలాముడూ!" అంటాడు అప్పలస్వామి, తింటున్న టిఫిన్‌కి అడ్డం వస్తున్న మీసాలు సవరించుకుంటూ. మీసాలు సవరించుకుంటున్నట్లుగా దువ్వుకోవడం అతడికి అలవాటు.

"ఒక రేం కర్మ! ఇద్దర్ని పెట్టాలనే సూస్తున్నాను. కానీ, ఏటి లాభం! యాపారం సూస్తే దివాలా గజం బద్దలాగుంది. సంత రోజు తప్ప ప్రతి రోజు ఈగల్దోలుకోటమేగా!" అంటాడు అప్పలాముడు, చేతికి ఉన్న ఉంగరాలు కనపడేటంతగా చేతులు ముడుచుకుంటూ. చుక్క మెడ వంక చూచిన వాళ్ళకు ముందస్తుగా "అయ్యొ వాళ్ళ కన్నో రెట్టింపవే. వేనేం దాని కెట్టేట్ట లేదు. పెళ్ళయి సంక యాపారంలో నష్టం వస్తున్నా, దాని చేతి గాజు అమ్మేసి బండి నడుపుకొస్తున్నాను. అది కనికరించకపోతే ఈ హోటలు ఏ నాడో మూత పడేది" అని చెపుతాడు నమ్మకంగా. హోటలు మూత పడుతుం దన్నప్పుడల్లా గన్నిగాడి గుండె గుభిల్లుమంటూంటుంది. హోటలు మూత పడితే తన గతేమి కావాలన్నది వాడి భీతి.

ఏడు గంటలకు ముందుగానే బస్సు బయలు దేరి పోతుంది. ఆటు తరవాత అర గంట వరకు హోటలులో కాస్త రద్దీగానే ఉంటుంది. రద్దీ తగ్గిన తరవాత చుక్క, అప్పలాముడు టిఫిన్ లోపలికి పట్టుకు వెళ్ళి తింటారు. ఆ సమయంలో గన్నిగాడు సర్వరు, క్లీనరే కాక, కాషియర్ కూడా. అప్పుడే వాడు అప్పలాముడు రూపాన్ని పూర్తిగా ధరిస్తాడు.

"ఇదిగో, సిన్నాసెలం! డబ్బు ల్లేకపోతే నాలుం లేదు. అరువు లేదు. బోర్డు సూడు!" అంటూ అథారిటీ చలాయిస్తాడు క్యాష్ బాక్సు ముందు కుడి కాలి మీద నిలబడి, ఎడమ కాలు కుడికాలి మోకాలుమీద ఉంచుకుని. తమ హోటలుకు వచ్చేవారి నైజం వాడికి బాగా తెలుసు. డబ్బు ల్లేకుండా హోటలుకు వచ్చిన ముఖాన్ని సులభంగా కనిపెట్టేస్తాడు. అప్పలాముడయ్యగారు వచ్చేంత వరకు అటు కన్నెత్తి చూడడు.

టిఫిన్ చేసొచ్చి కౌంటర్ ముందు కూర్చుం టుంది చుక్క. గన్నిగాడు పక్కకు తప్పుకుని ప్లేట్లు, గ్లాసులు తీసేయడానికి వెళతాడు. అప్పలాముడు కష్టసుఖాలు అవసరాలు కనుక్కుంటూ రెండు గ్లాసుల చిక్కటి కాఫీ చేసి, చుక్క కొక గ్లాసందించి, తనొక గ్లాసందుకుని, పొయ్యి మీద మూకుడు పడేస్తాడు.

ఉప్మా చెయ్యడానికి నప్పనాటి బియ్యం నూకనే గోధుమరవ్వ అని దబాయిస్తాడు అప్పలాముడు. ఉప్మా అయ్యేంతవరకు ఉగ్గబట్టుకుంటాడు ఆకలిని. ఉప్మా దింపి జటావేలు తాళింపుకి వేటబ్బ గిన్నె పడేస్తాడు పొయ్యిమీద అప్పలాముడు. అటు సిమ్మెటే గన్నిగాడి వైపు చూస్తాడు. రెండు పూరీలు, రెండు గరిటెల ఉప్మా, రెండు ఇడ్లీలు, కూర ఆకులో వేసి ఇస్తాడు (ఒక్కొక్క రోజు ఏది మిగిలితే దాని తోటే ఉదయం టిఫిన్ అయిం దని పించాలి వాడు). ఆ ఆకును పట్టుకుని బల్లకు వెనకగా పోయి నేల మీద ఆకును పెట్టుకుని ఆబగా తింటాడు వాడు, గొంతు కూర్చుని. ఆ సమయంలో వాడి చిరిగిన లాగును చూచి అసహ్యంగా ముఖం చిట్లిస్తుంది చుక్క. వాడి కదేం పట్టదు.

వాడి చిరుగుల లాగును చూచి "మంచి లాగులు రెండు కుట్టించుకోరాదురా, గన్నీ?" అని బాధ పడుతూ రెండు, మూడు సార్లడిగింది చంద్రి. ఆ అమ్మాయి ఆ పూరి స్కూల్లోనే ఎనిమిదవ తరగతి వరకు చదివి మానేసింది. మాట్లాడేటప్పుడు తప్పులు లేకుండా స్పష్టంగా మాట్లాడాలని ఆ అమ్మాయి ప్రయత్నం చేస్తూంటుంది. ఇంకా చదువుకోవాలని ఆమె కుందీ కానీ, వోణీలు వేసుకునే రోజు రాగానే గోవరాజు 'చదువు చాల్లే' అని ఆపేశాడు.

ఆమె ప్రశ్నకు మొదట్లో "మా నాయన సంకు రేతికి సంతలో కొంటాడు" అని చెప్పేవాడు.

ఆ ఆశ పోయిన తరవాత "అప్పలాముడు నాగులచవితికి కొంతానని చెప్పాడే" అని చెప్పే వాడు.




## అందమైన భార్య కావలెను

ఈ కాలంలో ప్రతీ యువకుడూ అందమైన భార్యనే పొందాలని కోరుకుంటున్నాడు. యువతులు కూడా చూడచక్కని వాణ్ణే, అందమైన వాణ్ణే భర్తగా ఎంచుకొంటున్నారు. ఇదంతా అదృష్టంపైనే ఆధారపడి వుంటుంది. గోధుమవన్నె చాయ, ఎర్రని మేని వర్చస్సు కల చాలామంది యువతీయువకులు యుక్త వయస్సులో కేవలం ముఖంపైన **మొటిమలు** మరియు ముఖంలోని జిడ్డుతనం వలన నిరుత్సాహంగాను, కాంతి హీనంగాను కనపడతారు. అటువంటివారి పాలిట **సరూప్ లేప** నిజంగా ఒక వరప్రసాదమనే ఋజువు అవుతుంది.

ఢిల్లీకు చెందిన ప్రసిద్ధిగాంచిన ఆయుర్వేదిక్ కంపెనీ "అమృత్ ఫార్మస్యూటికల్స్" సంస్థవారు యోగ్యమైన, ఆయుర్వేదపు సౌందర్య సాధనమైన ఈ **"సరూప్ లేప"** ను ప్రవేశపెట్టింది.

రాత్రి పడుకోబోయే ముందు ఈ "లేప"ని నీళ్ళతో కలిపి ముఖంపై రాయండి. ఇది **మొటిమలను,** మొటిమలవలన ఏర్పడిన నల్లని మచ్చలను రూపు మాపుతుంది. లేపని మీరు రాసుకున్నప్పుడు అది చర్మంలో ప్రవేశించి అదనపు నూనెను, జిడ్డుతనాన్ని పీల్చివేసి మీ చర్మానికి ఉజ్వల కాంతి నిస్తుంది. మొటిమలు మటుమాయమవుతాయి. మీ ముఖ వర్చస్సులో వచ్చే మార్పు వలన మీలో విశ్వాసం పెంపొందుతుంది. మీరు రోజంతా తాజాగా యవ్వనవతులుగా సహజ సౌందర్యంతో హాయిగా వుంటారు.

"సరూప్ లేప" అన్ని ప్రముఖ మెడికల్ మరియు జనరల్ స్టోర్సులో లభిస్తుంది.

డబ్బాలు ధర రూ. 6/—(చిన్నది)
రూ. 10—80 (పెద్దది)
అన్ని పన్నులు అదనం.

పంపిణీదారులు
**మోతీ అండ్ కంపెనీ,**
సుల్తాన్‌బజార్, హైదరాబాద్—500001

M. K. Publicity

ఆ ఆశా పోయిన తరవాత ఏం చెయ్యాలో తెలియక మవునం వహించాడు.

ప్రతిసారీ ఆ చిరుగులు ఓపికగా కుడుతూనే ఉంది చంద్రి. మరీ పీలిక లైన తరవాత ఆమె ఏమీ చేయలేక పోయింది. తమ్ముడి లాగులు రెండిచ్చి కట్టుకోమంది చంద్రే. అవే తన తమ్ముడి పొడుగు లాగిచ్చింది వాడికి, ఎప్పటికైనా ఉంచేసుకోమని. ఆశ్చర్యపడుతూ, అంతకన్నా ఆనంద పడుతూ తీసుకున్న ఆ పొడుగు లాగును ఒక్కసారే తొడుక్కొని, మళ్ళీ విప్పేసి, మడతలు పెట్టేసి సినిమాకు పక్క వూరిలో ఉన్న టూరింగ్ టాకీసుకు వెళ్ళే రోజున వేసుకుందామని దాచేసుకున్నాడు. కాని, వాడటు తరవాత సినిమాకు వెళ్ళే అవకాశమే రాలేదు.

"మరి నాను కాపోయినా ఆడన్నా ఏసుకుంటాడు" అని ఒక రోజు దారి కాచి, పలకా బలపం పట్టుకుని బడికి వెళుతున్న నారిగాణ్ణి పిలిచి, "ఒరే, తమ్ముడూ! ఈ పొడుగు లాగు నీ వుంచేసుకోరా. నాలా పెద్దయి నంక ఏసికో. సినేమా కెళ్ళినప్పుడే ఏసికోవాల! ఎరికా!" అంటూ హెచ్చరించి పొడుగు లాగు ఇచ్చేశాడు. నిజానికి ఇంటికి వెళ్ళి ఇచ్చి రావాలనే ఉంది. కాని, పిన్ని రానివ్వదు వాణ్ణి.

"పిన్ని తన్నుద్ది అటుకే సెళ్తే! నాయిన పిన్ని నేటనడు. అందుకేగా నే నప్పలాయుడి దుకానంలో ఉండేది?" వివరించి చెప్పాడు ఒకసారి చంద్రికి— 'నీకు తమ్ముడు పుట్టినాడంట' అని చంద్రి అన్నప్పుడు.

టిఫిన్ చేయటం ముగించి, గబగబా బల్లల నొకసారి సర్దేసి, గాసులు, ప్లేటు కడిగేసి, నుయ్యిలు బావి నుండి పెద్ద సిల్వరు గిన్నెతో నీళ్ళు తెచ్చి ఇత్తడి గంగాళంలో స్టాకు చేసుకుంటాడు. ఎదురుగా ఉన్న చెరువుకు పోయి గాసులు, పళ్ళాలు కడిగేందుకు నీళ్ళు రెండు గోలాలలో పోసి సిద్ధం చేసుకుంటాడు. ఈ లోపల అప్పలాయుడు గాజు తలుపుల బీరువాలో ఉప్మా, సెనగలు, మిగిలిపోయిన పూరీలు, ఇడ్లీలు, కూర సర్ది, వేడినీటి స్నానం చేసి వస్తాడు. చన్నీటి చుక్క ఒంటిమీద పడితే జలుబు చేస్తుందని అప్పలాయుడు తాయమ్మ చిన్నప్పుడు పొయ్యి దగ్గర నుండి వేడినీళ్ళే పోసుకుంటూంటాడు. ఆదే విషయాన్ని హోటలుకు వచ్చిన వాళ్ళతో గర్వంగా చెప్తాడు, "మున్నూట అరవై రోజుల ఏడినీళ్ళుండాల్సిందే" అని.

అప్పలాయుడు స్నానం చేసి వచ్చి లక్ష్మీదేవి పటంముందు, వెంకటేశ్వరుడి పటంముందు అగరు వత్తులు వెలిగించి పెట్టి భక్తి ప్రదర్శించు కుంటూంటే, చుక్క లోపలికి వెళ్ళి లక్స్ సబ్బుతో ముఖం రెండు సార్లు రుద్ది, పౌడరు కాస్తంత అద్ది (ఆ పౌడరు పేరేమిటో చుక్కకు తెలియదు. అది సంతలో అమ్మే పౌడరే. కాకపోతే దాన్ని 'పాండ్స్' అని మాత్రం అనగలదు చుక్క), సినిమా స్టారులా కాటుక, తిలకం పెట్టుకుని, జడ విప్పి ముళ్ళో పాయలు అల్లేసుకుని, నలిగిన చీర మాత్రం మార్చుకుండా (ఆ చీరతోటే రోజంతా ఉండటం ఆమెకు ఇష్టం) కౌంటరు ముందు కూర్చుంటుంది చుక్క.

ఆదేవేళ వస్తాడు వీరాస్వామి. వాడి మెలదిరిగిన మీసాలు చూసినా, కెంపులా మెరిసే కళ్ళను చూచినా, వాడి మెడలో వేలాడే ఆంజనేయుడి బిళ్ళను చూచినా సన్నిగాడు భయంతో వణికి పోతాడు. వాడు హోటలుకు వచ్చిన క్షణంనుండి



అన్ని ముఖ్య కేంద్రములలో డీలర్లు కలరు.

ఏదో మూల దాక్కోవాలనే ప్రయత్నం చేస్తూం టాడు వాడు.

"అప్పలాముడూ! టిఫిని!" అంటూ వీధి లోంచే రంకెలు వేస్తాడు వీరాస్వామి. గన్నిగాడికి పెట్టినంత టిఫినూ వాడికీ పెట్టాలి.

"ఈరాసామీ! కాతా పెరిగి పోతంది" అంటాడు అప్పలాముడు.

"అయితే, ఏటంటావ్?" రంకె వేస్తాడు వీరాస్వామి.

"ఏటంటాను! తీరిచీమంటాను."

"ఆడి జీతంలో ఇరగ్గొట్టుకుంటూ ఇదేం మాట!" అంటాడు.

"ఈ నెల జీతానికి మించే తిన్నవ్!"

"అయితే? వచ్చే నెల ఆడు పన్జేయడా! ఆడి జీతం కాకపోతే ఆడి బేటా డబ్బుల్లో ఇరగ్గొట్టుకో. నాకాడమాత్తరం ఇసుంటి మాట లింకెప్పుడూ అనొద్దు" అంటూ వార్నింగ్ ఇస్తాడు.

ఆ విధంగా గన్నిగాడు బేటా డబ్బుల్ని కాని, జీతాన్ని కాని కళ్ళ చూడకుండానే చెలు అవుతున్నాయి. జీతాన్ని మించే వీరాస్వామి బయలు గన్నిగాడు బాకీ పడ్డాడనే అంటాడు అప్పలాముడు.

మక్కుకు కోపం వచ్చినప్పుడెలా ఒక ముద్ద తగ్గించే కూడు పడేస్తుంది, రెండు గంటల వేళ. ఆ వారునీ భృన్నాన్ని ఆప్యాయంగా భోజనం చేస్తాడు గన్నిగాడు. వీరాస్వామి టిఫిన్ కాతావల రావలసిన దానికి ప్రతిగా ఉదయం ఇవ్వవలసిన టిఫిన్ తగ్గిం చేశాడు. ఉప్మా, సెనగలు మాత్రమే వాడి ఉదయం టిఫిను.

వీరాస్వామి నిష్క్రమించిన తరవాతనే ఏ ఇరక లోనో దాక్కున్న గన్నిగాడు ఇవతలికి వస్తాడు.

అప్పటినుండి కాఫీ, టిఫిను తయారు చేసి సప్లయి చేయటం తప్ప వేరే పనేమీ ఉండదు అప్పలాముడికి, మధ్యాహ్నం రెండు గంటల వరకు.

ఉదయం తొమ్మిది గంటల దగ్గరినుండి బడికి వచ్చే పిల్లల, ఉపాధ్యాయుల రద్దీతో ఆ దారికి కొంత కళ వస్తుంది. అప్పలాముడు ఇనప రింగులో గుచ్చిన నువ్వులు, చేగోడీలు కౌంటరుకు పక్కగా వేలాడదీస్తాడు. ఆ పక్కనే టేబిల్ మీద బిస్కట్లు, పిప్పర్‌మెంట్ల సీసాలు సర్దుతాడు. నాలుగురకాల సిగరెట్ పాకెట్లు మరో సీసాలో అదే టేబిల్‌మీద ఉంటాయి. పిల్లల రాకపోక లతో హోటలులో రద్దీ ఏర్పడుతూ ఉంటుంది. కొందరు పిల్లలు టిఫిన్ చేస్తూ ఉన్నప్పుడు. డబ్బులు టేబిల్‌మీద చుక్క ముందు వాళ్ళు గిరవాటువేసే దోరణి చూస్తూ, వాళ్ళనుభవించే ఆర్థిక స్వాతంత్ర్యానికి ఈర్ష్యపడతాడు గన్నిగాడు. కొందరు పెద్ద తరగతి పిల్లలు కాసులు ఎగ్గొట్టి హోటల్లో దూరి, రహస్యంగా సిగరెట్లు కాల్చుకోవటం, దాన్ని అప్పలాముడు ప్రోత్సహించటం, గన్నిగాడు రహస్యంగా లెక్కల మాస్టరు గారికి చేరవేయటం, ఆయన బడి పిల్లల కెవరికీ సిగరెట్లు అమ్మవద్దని కట్టుడి చేయటం, అప్పలాముడు అతనితో వాదనకు దిగి నోరు పారేసుకోవటం, మిగతా పిల్లలు అప్పలాముడి మీద తిరగబడి యాగీ చేయటం ఒకనాటి సంఘటన. ఆ నాటి నుండి పిల్లలను ఒక కంట కనిపెట్టే ఉంటా డాయన. పిల్లల చేత మాస్టరు సిగరెట్లు తప్పించుకునే పద్ధతిని ఖండించి ముగ్గురు ఉపాధ్యాయుల దృష్టిలో చెడ్డ వాడయినాడతను. అతనంటే గన్నిగాడికి అభిమానం. "మంచి మేస్టరుగారు!" అంటాడు వాడు. ఎప్పటికైనా అనుసరించగలిగేది అతడనే వాడి అభిప్రాయం. ఏ మాస్టరుగారు పిలిచినా పరుగెత్తి కాఫీ, టీ అందిస్తాడు స్టాఫు రూము అనబడే పాకలోకి. కాని, వాడు చొరవగా మాటాడ గలిగేది లెక్కల మాస్టరుతోనే. ఆయన పేరు వాడికి తెలియదు. ఆయన ఉదయం పది గంటలకు అరగంట ముందుగా సైకిలు మీద పక్క వూరు నుండి వస్తాడు. అతని రాకను చూచి టీ పట్టుకుని వెళతాడు గన్నిగాడు. మొదటి రోజులో టీ పట్టుకు వెళ్ళి అతను టీ తాగుతూంటే మవునంగా నిలబడ్డ గన్నిగాణ్ణి కదిలించి వాడి కథను విన్నా డాయనే. ఆ నాటి నుండి అతని మీద విపరీతమైన అభిమానం. వాడికి అతన్ని చూస్తే కొండంత ధైర్యం.

"అయితే, నీకు చదువుకోవాలని ఉందా?" అడిగా డాయన.

"నాకు చదువొస్తాదాండి?" భయపడుతూ అడిగాడు.

"ఎందుకు రాదు?" అంటూ రెండవ తరగతి తెనుగు వాచకం కొని ఇచ్చా డాయన. రెండు, మూడు పాఠాలు చదివించాడుకూడా. తరువాత ఆ పుస్తకం రెండు, మూడు రోజులు కనిపించక పోవటం, మరి నాలుగురోజులుపోయినతరవాత ఆపుస్తకంలోకాగితాలు వాలుగైదు మడతల్లో పెరటల్లో అంట్లగిన్నెల మధ్య కనిపించటం, అదే విషయాన్ని కన్నీరు పెట్టుకుని గన్నిగాడు మాస్టరుగారికి విన్నవించటం, ఆయన మరొక పుస్తకం కొని తేవటం, "దీన్నికూడ అట్టాగే సేస్తది నుక్కమ్మ. వద్దు, మాస్టరుగారూ" అంటూ వాడు తిరస్కరించడం జరిగింది.

"నాతో మా వూరు వచ్చేయరా. నా దగ్గరే ఉందువు గాని. నీకు చదువు చెపుతాను. ఎలిమెంటరీ స్కూల్లో చేర్పిస్తాను. మీ అమ్మగారూ మంచిది" అంటూ చెప్పా డాయన. గన్నిగా డా సాయంత్రం ఎదురు చెప్పక అతని వెంట వచ్చాడు. ఆయన సైకిలు మీద కూర్చుండపెట్టుకుని తీసుకువెళ్ళాడు. దారంతా సుందర స్వప్నాలు కంటూ, అతని కబుర్లు వింటూ వెళ్ళాడు. ఆ రాత్రి అతని భార్య కమ్మని భోజనం పెట్టింది. నిద్ర పోయేముందు స్వాతంత్ర్యం సాధించిన గాంధీగురించి,హత్య చేయబడిన అబ్రహామ్ లింకన్ గురించి చక్కటి కథలుగా చెప్పాడు. ఏ ప్రని వనంలో విహారుకొమ్మ ఎత్తు వరకు ఎగురుకొని పోతున్నట్టు, పచ్చిక బయళ్ళలో అందరితోబాటు ఆడుకుంటున్నట్టు, చెరువులో ఈత కొడుతూ తిరుగాడినట్టు కలలు కన్నాడు. ఆ స్వేచ్ఛా జీవితాన్ని శాశ్వతంగా అనుభవిస్తానని అనుకునే వేళ ఆ మరునాటి ఉదయం అతని ఇంటి ముందుకు రంకె లేస్తూ వచ్చాడు వీరాస్వామి. అతని వెనకనే వచ్చాడు అప్పలాముడు, వేడి రక్తాన్ని తాగ మరిగిన పులి మాదిరిగా. అతడు వేసే కేకలలో వీరాస్వామి తీర్చ వలసిన బాకీ ప్రస్తావన స్పష్టంగా వినిపించింది. వీరాస్వామి రంకెల్లో తన కొడుకు మీద తన కున్న అధికారమంతా స్రవి పరిచాడు.

"నా బాకీ నాకు పారే. ఈ దాగుల్బాజీ నా కొడుకు నా కెందుకు?" గాండ్రించాడు అప్పలాముడు.


"అయితే, నే తీర్చినప్పుడు బాకీ సెల్లు కట్టుకో." గన్నిగాణ్ణి ఈడ్చుకు పోతూ ఉరిమాడు వీరాస్వామి.

"పసివాడి సంపాదన మీద బ్రతికే నీవు మనిషివి కావు" అంటూ గన్నిగాణ్ణి విడిపించడానికి ప్రయత్నం చేశాడు మాస్టరు.

"ఆడి కొడుకు. ఆ డేటి చేసుకుంటే మనకేంలే, బాబూ!" అంటూ గ్రామస్థులాతన్ని సమాధాన పరచడానికి ప్రయత్నిస్తూ, గన్నిగాణ్ణి వాళ్ళతో పంపేశారు.

శ్రామికుడు

చిత్రం—నానిబాబు ( విశాఖపట్నం )



అదే రోజు మధ్యాహ్నం అప్పలాముడు ప్రత్యేకంగా మాస్టర్ని కలిశాడు.

"గన్నిగాణ్ణి నా దుకాణం నుండి తీసికెళ్ళిపోవాలని ఎప్పుడూ చూడకండి, బాబూ! మీ మంచికే చెబుతున్నాను" అన్నాడు.

అతని మాటల నంతగా పట్టించుకోక— "వీరాస్వామి రి కెంత బాకీ పడ్డాడు?" అని అడిగాడు, పర్సు తీస్తూ.

"అది బాకీ సంగతి ఆడు, గన్నిగాడు చూచుకుంటారు. మీ కాడి విషయం అనవసరం. నా విషయంలో ఇక కలుగ జేసికుంటే వూరుకునేది లేదు" అంటూ గట్టిగా హెచ్చరించి వెళ్ళిపోయాడు.

గన్నిగాణ్ణి వదులుకోవటం అప్పలాముడికి ఇష్టం లేదని గ్రహించిన తరవాత అత నేమీ మాట్లాడ లేకపోయాడు.

రెండు రోజులు పోయిన తరవాత టీ ఇచ్చి గన్నిగా డడిగాడు మాస్టర్ని—"రెండు ఇడ్లీ, రెండు పూరీ, ప్లేటు ఉప్మా డెబ్బై పయిసె అవుద్ది గదా?" అని.

### కావలెను

తీరిక కాలములో శక్తి షూటింగ్స్, షర్టింగ్సు మరియు చీరెల అమ్మకమును పెంపొందించుట ద్వారా జీతం లేదా కమీషను మీద నెలకు రు. 700/- సంపాదించుకొనుటకు ఏజంట్లు కావలెను. ఉచిత లిటరేచరుకు, శాంపిల్సుకు వ్రాయండి.

SHAKTI TEXTILES AGENCY (AP)
Post Box No. 1138, Delhi-110006

### మీకు బేబీ/బాబు కావాలా



ఏ కారణం చేతనైనా సంతానం లేని దంపతులు మమ్ము సంప్రదించండి. శ్రీ పురుష సంతానలోప నివారణ నిపుణులు

శ్రీ నాగార్జునమూలికకుటీరం
రైల్వే స్టేషన్ వద్ద, రామాలయం వీధి,
తెనాలి - 2

"అవును. ఏం?" అన్నాడు.

"రోజుకి డెబ్భయి పయిసె అవుతే నెల రోజుల కెంతవుద్ది, బాబూ!"

"ఇరవై ఒక్క రూపాయి" అన్నా డాయన.

ఆ సమాధానాన్ని విని ఏదో ఆలోచిస్తూ వెళ్ళిపోయాడు ఆ రోజుకు గన్నిగాడు.

మరునాడు అప్పలాము డందించే టిఫిన్ అందుకోక "ఈ రోజు కాడ్నుంచి నాకు టిఫిని ఎట్టక. నా బదులు టిఫిని మా అయ్య కెట్టే" అని చెప్పాడు.

అప్పలాముడుతో బాటు చుక్క నివ్వెరపోయింది.

"మా నాయిన పాత కాతా నా జీతంలో ఇరగ్గొట్టుకో."

". . . . . ."

"ఈ నెలతో మా అయ్య బాకీ తీరిపోవాల. నా జీతంతో ఇరక్కపోతే, నా టేటా డబ్బులూ ఉంచేసుకో. అదీ సాలకపోతే రేత్రి నాకు కూడెట్టక. ఈ నెల ఎనాగైనా మా అయ్య బాకీ తీరిపోవాల" అంటూ రెండు చేతుల్లో ముఖం దాచుకుని బావురుమన్నాడు వాడు.

వాడి మనసు అప్పలాముడి కంత సులభంగా అర్థం కాలేదు.

ఆ రోజు భోజనం చెయ్యటానికికూడా మొరాయించాడు.

అప్పలాముడు లెక్క చూచి చెప్పాడు— "ఈ నెల నీ జీతం సరిపెట్టినా ఇంకా అయిదు రూపాయలు మీ అయ్య బాకీ ఉంటది" అని.

అప్పుడు వాడి ముఖం వికసించింది.

ఉదయం వేళ టిఫిన్ మానటానికి గన్నిగాడు ఎంత ప్రయత్నించినా,అప్పలాముడుమనస్సు ఒప్పుకోలేదు. ఆ నాటి నుండీ 'ఉప్మా, సెనగలు' వాడి ఉదయం టిఫిన్‌గా పరిణమించాయి. వాడు చేసే పనికి ఆ మాత్రం టిఫిన్ పెట్టటంలో అన్యాయం లేదని చుక్క అంగీకరించింది. అందుకు ప్రతిగా ప్రత్యేకంగా వాడినుండి ప్రతిఫలాన్ని రాబట్టాలన్న ఆలోచన ఆమెకు లేకపోలేదు.

హావు తక్కువ పదికి ప్రార్థనకు గంట మోగుతుంది. హోటల్లో పూర్తిగా రద్దీతగ్గుతుంది. చుక్క స్నానానికి లేస్తుంది. గన్నిగాడు పెరట్లో జామచెట్టు క్రింద వేడి నీళ్ళు ఆమె స్నానానికి సిద్ధంచేసివస్తాడు. పిల్లలు ప్రార్థనా గీతం పాడుతూంటే, గన్నిగాడు గేటు దగ్గర నిలబడి ప్రార్థన ఆలకిస్తాడు. అదే వేళలో చుక్క కంచె అవతల, ప్రతి నిత్యం కంచె అవతల నుండి చూచే రెండు కళ్ళను ఓరకంట చూస్తూ స్నానం ముగించి ఒక్కసారి దొండపాదు పక్కకు తప్పుకుంటుంది. ఆ మర్యాదస్తుడు 'టీ'కి ఏదో సమయంలో, సమయం చూచి వచ్చినప్పుడు కంచెను అడ్డుగా చేసుకుని దాచుకోవటానికి ప్రయత్నించిన శరీరాన్ని ఆ సమయంలో దాచుకునే ప్రయత్నాన్ని నటిస్తుంది. రెండు, మూడు సిగరెట్లను అక్కడే ఆగలేసి, బిల్లు చెల్లించి నిర్లక్ష్యంగా కదిలిపోయే అతను అప్పలాముడి కేమనిపించక పోయినా, గన్నిగాడి చిన్న మనసు అసూయ పడుతుంది. అతనికి టీ పట్టుకు వెళ్ళి ఇవ్వటానికి కూడా ఇష్టపడడు. అతని మాటల తీరు అసహ్యంగా ఉంటుంది. అతను ఇచ్చే సలహాలు చాలా రోతగా ఉంటాయి.

అతడు కదిలిన వెనకే వంటింటిలోకి కదులుతుంది చుక్క. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో కొద్దిగా టిఫిన్ బేరం తప్ప మిగతా రోజంతా టీ, కాఫీ బేరాలతోనే గడిచిపోతుంది.

మధ్యాహ్నం భోజనం చేసి ఒక గంట నడుము వాల్చితే కాని ఉండలేడు అప్పలాముడు. చుక్క అతని కోసం అతనితోబాటు విశ్రాంతి తీసుకునే వేళ గన్నిగాడే హోటలుకు సర్వాధికారి. టీ, కాఫీలు చేసి అందించటంతోబాటు మిగతా పనులు తనే చేస్తాడు. అప్పలాముడు నిద్రలేచి టీ తాగి, గన్నిగాడికి టీ పోసి, చుక్కకోసం లోపలికి పట్టుకు వెళతాడు. స్కూలు వదిలిపెట్టే వేళకు మరునాటికి కావలసిన వస్తువుల జాబితా తయారు చేసుకొని బయలుదేరే అప్పలాముడి వెనక హోటలు సర్వాధికారాలను చుక్క పరం చేసి పెద్ద సిల్వర్ బేసిన్ పట్టుకుని వెళతాడు గన్నిగాడు. పప్పుదినుసులు గల బేసిన్ మోసుకుని వాడు హోటల్ చేరే వేళకు మాస్టారి సైకిలు అక్కడ ఉండదు. మాస్టారు వెంట గన్నిగాడు వెళ్ళ గొత్తి పోకుండా ఉండేందుకు అప్పలాముడిని ఒప్పించి బజారుకు పంపిన చుక్క ఆ నాటి ఆదాయాన్ని లెక్కపెట్టి అప్పలాముడికి అప్పగిస్తుంది. ఆమె చెప్పిన లెక్కను అతడు అనుమానించక నమ్ముతాడు.

బటానీలు నానబెట్టిన పనినుండి ఇడ్లీ పిండి రుబ్బి కవతల పడేసరికి గన్నిగాడి చుట్టూ చీకటి ఆవరించనే ఆవరిస్తుంది. అలసిపోయిన కళ్ళతోనే మరునాటి ఉదయానికి కావలసిన నీళ్ళను గంగాళం లోకి, గాబుల్లోకి పోసి, చుక్క చీకట్లో స్నానంచేసి వదిలేసిన చీరను గుంజి ఆరేసి, భోజనం వేళకు ముందుగానే బల్లమీద నిద్రకు ఒరుగుతాడు. అప్పలాముడు నిద్ర లేపి, భోజనం ముందు కూర్చో పెడితే, నిద్ర మత్తులోనే రెండు ముద్దలు తినేసి, నిద్రపోతాడు. ఆ విధంగా ముగిసే వాడి దిన కార్యక్రమంలో అందరిలా పుస్తకాలు పట్టుకుని చదువుకోవాలనే కోరిక, పచ్చటి మైదానాల మీద ఆడుకుని, చెరువులో ఈతలు కొట్టి, గాలిలో స్వేచ్ఛగా పక్షిలా ఎగిరి ఆడుకోవాలనే కోరిక సమాధి అవుతూంటాయి. వాళ్ళమ్మ బతికి ఉన్న రోజుల్లో వాడిని జోకొట్టి తన పక్కన పడుకోబెట్టుకుని నిద్రపుచ్చిన పట్టె మంచంమీద పడుకోవాలని, తన కష్టాల నన్నింటిని చెప్పుకుని ఆ మంచం మీద ఏడవాలని వాడి కెంతో ఉంది. కాని, ఆ కోరిక నెరవేరదని వాడికి పూర్తిగా తెలుసు. అయినా, ఏదో రోజు ఇంటికి వెళ్ళి తన తమ్ముడు నారిగాడికి, వాడికోసం తాను దాచి ఉంచిన నిధిని అందజేయగలడన్న విశ్వాసం మాత్రం వాడికి పరిపూర్ణంగా ఉంది. ఆ నిధిలో రెండు అర్ధ రూపాయి నాణాలు, నాలుగు పది పైసల బిళ్ళలు, డజనుకు పైగా పలక పుల్ల ముక్కలు, సిరా అద్దిన నాలుగైదు సుద్ద ముక్కలు, రెండు మూడు రంగు సుద్దముక్కలు, ఒక ములు విరిగిన పెన్సిలు, నాలుగు పిట్ట గోళీలు, ట్వైను దారపు చుట్ట ఉన్నాయి. వాటి నన్నింటిని గుడ్డ సంచిలో పదిల పరిచి ఉంచాడు.

వారం రోజుల క్రితం చంద్రి ఇత్తడి బిందెలోకి పాలను పోస్తూ చెప్పింది: "వచ్చే పోయకాలం నాకు

పెళ్ళి. ఆ రోజు భోజనానికి రెండు పూటల నీ విక్కడే ఉండిపోవాలి."

పెళ్ళి భోజనం దొరుకుతుం దనగానే ఆనందం కలిగింది వాడికి. అంతలోనే చంద్రి పెళ్ళయిన తరవాత మరక్కడ ఉండదని తెలిసేసరికి వాడి ఆనంద మంతా నీరు కారిపోయింది.

"అయితే, అక్కయ్యా, నివ్వెళ్ళిపోతవా?"

"పెళ్ళయిన తరవాత కన్నోరింట ఉండ నివ్వరుగా?"

"నేనూ వచ్చేత్తా. నన్నూ తీసికెళ్ళిపో. నీ ఇంటనే ఉంట. సెప్పిన పనల్లా చేస్తా. అక్కడే ఉండి పడుకుంటా."

"అలాగే! నే వెళ్ళిన తరవాత ఆ ఇంటిలో నా మాట వినేవా రుంటారో, లేదో చూసుకుని, నీ బావగార్ని ఒప్పించి నిన్ను తీసుకెళ్తాలే."

"ఒట్టు!"

"ఒట్టు!" చేతిలో చెయ్యేసి అరచేతిలో గిల్లి చెప్పింది.

"మా సెంద్రి అక్కయ్యకి ఒచ్చే సోంవారం పెళ్లి." మాస్టారితో చెప్పాడు.

ఆయన 'అలాగా' అన్నట్లు తల తాటించాడు.

"అక్కయ్యతో నానూ ఎల్పోతా. ఎళ్లే ముందు మీకు సెప్పే ఎల్తా లెండి. సోంవార మంటే ఎన్నో తారీకు?" అడిగాడు.

"ఇరవై ఎనిమిది." చెప్పా డాయన.

"నెల పూర్తవడానికి ఎన్ని దినా లుంట యింకా?"

"మరి రెండు రోజులు."

"అలాగా!" అంటూ టీ గ్లాసు పట్టుకొని వెళ్ళి పోయాడు.

ఆ రోజు నుంచి మధ్యాహ్నం పూట భోజనం మానేశాడు వాడు. వాడి అంతర్యం లీలగా అర్థ మైంది అప్ప్రలాముడికి.

"బాకీ చెల్లుగట్టుకుని పారిపోదామని చూస్తున్న వేమో? అది నీలు పడదు. నీ నాయిన తాగటానికి చేసిన చేబదులు అప్పు ముప్పయి రూపాయలు దాటింది."

"నాకు సెప్పకండ ఆడు సేసే అప్పులకి నా కేటి సంబందం నేదు."

"ఈ మాటే నీ నాయినతో చెప్తా."

"సెప్పుకో!"

"బాకీ చెల్లు కట్టి ఏం చేదామని?"

"ఎల్పోతా?"

"ఎక్కడికి? ఎవరితో? మాస్టారు తోనా?"

"కాదు."

"మరి?"

"నాను సెప్పను."

అప్ప్రలాముడు నిజంగా భయపడ్డాడు. వాడిలా పనిచేసే కుర్రవాడు తనకు మరల దొరికేనా? వాడిని ఎలా లొంగ దీసుకోవాలో అప్ప్రలాముడికి తెలియ లేదు.

మరునాడు ఉదయం వీరాస్వామికి విషయాన్ని సమగ్రంగా చెప్పాడు. టిఫిన్ తింటున్న వీరాస్వామి రెచ్చిపోయాడు. బల్లల వెనక మూలలో దాక్కున్న గన్నిగాణ్ణి చితక తన్నాడు. "చెప్పినట్టు ఇనుకో!" అంటూ హెచ్చరించాడు. గన్నిగాడు ఎదురు చెప్ప లేదు. తను నిర్వహించవలసిన కార్యక్రమంలో లోపం రానివ్వలేదు. ఆ రోజు మధ్యాహ్నం భోజనం కూడా మానేశాడు. అప్ప్రలాముడు బెంబేలుపడ్డాడు. ఏం చెయ్యాలో అతడికి తోచలేదు. మూడు, నాలుగు రోజులు అలానే గడిచాయి.

అయిదవ రోజు ఉదయం మాస్టారు స్కూలుకు వస్తున్న వేళ, అతని మీదికి ఒక్కసారి దాడి చేశాడు అప్ప్రలాముడు.

అప్ప్రలాముడు చెప్పింది విని నివ్వెర పోయా డాయన. గన్నిగాడి కీ ఆలోచనల కలగ జేసింది తనే అన్న అభియోగానికి అతనికి బాధ కలగలేదు. గన్ని గాడు భోజనం మానేసి చాకిరీ చేస్తున్నందుకు బాధ కలిగింది. గన్నిగాడ్ని పిలిచా డాయన.

"భోజనం ఎందుకు మానేశావు?" అడిగాడు.

"మా నాయిన టిపిని కాతా చెల్లుకట్టాల."

"ఇలా ఎన్ని రోజులు మానేస్తే టిఫిన్ కాతా చెల్లవుతుంది? నీకు తెలుసా?"

"పాత బాకీయే చెల్లు కడ్తన్న. కొత్త బాకీనేదు."

"ఎలా? నీ నాయన హోటలుకి రావడం మానే శాడా?"

గన్నిగాడు క్లుప్తంగా చెప్పాడు. అతని మనసు గిలగిలలాడింది.

"ఇంకా బాకీ ఎంత చెల్లుబడి కావాలో చెప్పు. నే నిచ్చేస్తాను" అంటూ పర్సు తీశా డతను.

"ఈడి అయ్య నా కాడ చేసిన అప్పు చాన ఉంది. అది ఎవరూ తీర్చేది కాదు. ఈడి విషయంలోకి రావద్దని చెప్పాలనే ఇదంతా చెప్పిన. జాగరత్తగుంటే మంచిది. ఈ వూరి సంగతి నీ కెరక నేదు. నీదీవూరు కూడ కాదు. గురుతుంచుకో" అంటూ గన్నిగాణ్ణి లాక్కుంటూ వెళ్ళిపోయాడు అప్ప్రలాముడు.

మాట వినకపోతే అసలు భోజనం పెట్టేదే లేదని హెచ్చరించాడు అప్ప్రలాముడు. అలాగే కానిమ్మ న్నాడు గన్నిగాడు. ఆ రోజు రాత్రి కూడా గన్నిగాడు భోజనంచేయలేదు.

మరునాడు ఆదివారం. లేస్తూంటే కళ్ళు ఒక్క సారి తిరిగాయి. భూమి మీదికి ఒరిగిపోతు న్నట్టని పించింది వాడికి. ఒక ముంతెడు మంచినీళ్ళు తాగాడు. ప్రాణాలు నిలిచినట్లయింది. ఉదయకాలపు తన కార్యక్రమంలోకి చొరబడి నెమ్మదిగా ఒక్కొక్క పనీ పూర్తి చేశాడు. అప్ప్రలాముణ్ణి నిద్రలేపి పాలకని బయలుదేరాడు.

"రేపు రాత్రి కదా నీకు పెళ్లి?" అడిగాడు చంద్రిని. అవు నం దా అమ్మాయి.

"మంగళారం పెందిల్నే ఎల్పోతవా?"

"తీసికెళిపోతారేమో?"

"అప్ప్రలాముడి బాకీ రేపటితో తీరిపోద్ది. ఎల్లుండి పెందిల్నే నానూ నీతో వస్త" అన్నాడు.

"అప్ప్రలాముడి బాకీ ఏమిటి?" అని అడిగింది.

వారం రోజులుగా జరుగుతున్నదంతా చెప్పాడు. అప్పుడు చంద్రి గుర్తించింది—వాడిపోయిన వాడి ముఖాన్ని, నీరసించిన వాడి కళ్ళను. కాచిన పాలను ఒక గ్లాసుతో ఇచ్చింది. చాలా ఆబగా తాగాడు వాడు. వాణ్ణి చూస్తూంటే ఆమె కళ్ళలో నీ రాగలేదు. నీరసం మీద పాల బిందె నెక్కడ పడేస్తాడో అన్న భయంతో తనే వాడి వెనక వస్తానంది. ఎందుకో అంతలో తగ్గి తన తమ్ముణ్ణి ఇచ్చి పంపించింది.

అప్ప్రలాముడు మండిపడుతూంటే నెమ్మదిగానే తన పనులు తాను నిర్వహిస్తూనే ఉన్నాడు. ఉదయం టీ నీళ్ళు మాత్రమే పోశాడు అప్ప్రలాముడు. టిఫిన్కి పిలవలేదు. గన్నిగాడు చెయ్యిచాచి అగలేదు. సైకిలు దిగుతూనే మాస్టారు గన్నిని పిలిచి వేడివేడి అన్నం పొట్లం అందించాడు తినమని.

"అప్ప్రలాముడు మంచోడుకాదు, మాస్టర్బాబూ! ఆడు మీకేమైనా సేస్తాడు. వద్దు. నానుతిన్న" అంటూ అతనెంత పిలుస్తున్నా వినిపించుకోకుండా వచ్చేశాడు గన్నిగాడు. "ఈరోజు బడిలేకపోయినా నేను నీ కోసమే సంత కెడుతూ ఇక్కడ దిగామరా" అని అతను చెప్పిన మాటలేమీ వాడికి వినిపించలేదు.

ఆ రోజు ఆదివారం కావటం వల్ల హోటల్లో బేరం అంతంత మాత్రమే. అందువల్ల గన్నిగాడికి పనికూడా లేకపోయింది. అంతగా అవకాశం దొరికి నప్పుడెల్లా నీరసంతో ఏదో మూల జోగుతూనే ఉన్నాడు వాడు.

"రెండు రోజు లిట్టాగే ముడ్డి కాల్తే అడే దారిలో కొస్తాడు" అంది ముక్కా కాఫీ చప్పరిస్తూ.

మధ్యాహ్నం హోటలుకి సెలవు. గన్నిగాడు పావూ వంతానన్ని ఒక మూల గోనెపట్టా పరుచుకొని నిద్రకు ఒరిగాడు. నిస్సత్తువను నిద్రదేవి జోకొడుతూంటే ఆకలి మరిచి మరునాడు ఉదయం వరకు నిద్ర పోయాడు. ఆ నిద్రలో పెళ్ళయి మేనాలో వెళుతున్న చంద్రి వెంట వెళుతున్న కలలు, మాస్టారి సైకిలు వెనక కూర్చుని మాస్టారి కబుర్లు వింటూ వెళుతున్న కలలు ఎన్నో వచ్చాయి వాడికి. ఆ కలలలో అప్ప్రలాముడు అప్పుడప్పుడు కనుపించక పోలేదు వాడికి. కాని, ఇంతకుముందులా వాడు భయపడటం లేదు. రెండు, మూడు సార్లు అరిచి చెప్పాడు వాడు—

ఆకాశ వీథిలో....

చిత్రం—ఎస్. జయరావ్(మద్రాసు—600080)



"అప్పలరాముడూ! నీ బాకీ ఇయ్యాల్టితో సెల్లుకట్టిన. నాకు బయంనేదు" అంటూ, కనులు తెరిచి చూడగా ఎప్పటిలాగే చీకటి.

కాళ్ళలోను, చేతుల్లోను రక్తనాళాలు ఉరిలేయబడు తున్నప్పటికీ, కళ్ళు తిరుగు తున్నట్టనిపించినా, అప్పుడప్పుడు మెదడు మొత్తం శరీరాన్ని ఏదో లోయలోకి లాక్కుపోతున్నట్టనిపించినా చంద్రి పెళ్ళి భోజనాన్ని గుర్తుకు తెచ్చుకుని, ఉత్సాహాన్ని తెచ్చుకుని, నెమ్మదిగా లేచాడు. చీపురుతో ఊడుస్తూంటే చీపురే తన శక్తి అంతా లాక్కుని అర చేతిని పిండి రక్తాన్ని తాగుతున్నట్టనిపించింది. బల్లలు వాడి కన్న శక్తివంతమై కదలటానికి మొరాయించాయి. అంతలోనే ఎందుకో కనికరించాయి.

కదులుతున్నగాలి ఆగి పోయింది మళ్ళీ ఎందుకో కదిలింది. వాడి రక్తనాళాలలోని రక్తం తలుపులు బద్దలు కొట్టుకొని పోవాలనే ప్రయత్నం చేస్తోంది. తడి ఆరిపోయే వాడి గొంతు సమాధాన పరచ లేక పోతూంది. నెమ్మదిగా ముంతెడు నీళ్ళు తాగాడు. ఆ నీళ్ళు పేగులో కలియ తిరిగి మూసుకో బోతున్న రక్తనాళాల తలుపులు తెరిచి పోలేక పేగి పేగుల్లోనే తిరిగి వెనక్కి తిరిగి వచ్చాయి. భళ్ళున వాంతి చేసుకున్నాడు. ఆవతలికిపోయి సొమ్మసిల్లినట్టు పడి పోయాడు. చల్లగా ఎదురుగా ఉన్న వేపచెట్టు గాలి వీస్తూంటే వాళ్ళమ్మ పలుకరించి నట్లనిపించింది వాడికి. అంతలోనే ఎవరో తట్టిలేపారు వాడిని. కళ్ళు తెరిచి చూశాడు. ఎదురుగా చంద్రి తమ్ముడు- "పాలు తెచ్చా. ఇక్కడ పడి పోయావేం? ఇవాళ పెళ్ళి భోజనానికి రా. పన్నెండు కల్లా రావాలి. అక్కయ్య చెప్పింది. ఈ గ్లాసుపాలు నీకే" అంటూ అందించాడు. భయపడుతూ భయపడుతూ రెండు చుక్కలు తాగాడు. మొట్ట మొదటి సారిగా తల్లి పాలను తాగిన అనుభూతిని ఏ పసివాడూ వ్యక్త పరచలేడు. కాని, ఆ శక్తేకాని ఉంటే ఆ అనుభూతికి ఇదేమీ తీసిపోదని వాడు చెప్పగలడు. నెమ్మదిగా మరి రెండు గుటకలు వేశాడు. కళ్ళముందు చీకటి విడి పోయింది. రెండు చేతులతో గ్లాసు అందుకుని పాలు తాగేశాడు. తడిక దగ్గరికి వేశాడు. అప్పలస్వామిని నిద్రలేపాడు. పంతులుగారి పిల్లల్ని మేల్కొలిపాడు. స్నానానికి వెళుతున్న పూజారయ్యగారి వెంట వెళ్ళి 'నమస్కారమండీ' అని చెప్పి హోటలుకు తిరిగి వచ్చాడు. నిప్పు చేశాడు. పొయ్యిలో మంటలు వాడి వైపు పరుగెత్తుకొని రావాలని చూస్తున్నా ప్రతి రోజులాగే ఇడ్లీలు పెట్టాడు. పూరీ పిండి కలిపాడు. చేతులు కొంకర్లు పోతున్నా, చెరువు నుండి నీళ్ళు తెచ్చాడు. అప్పలరాముణ్ణి లేపాడు.

అప్పలరాముడు అరుపుల నే మాత్రం లెక్క చేయకుండా తన పని తాను చేసుకొని పోతున్నాడు. ఎనిమిది గంటల ప్రాంతంలో చాలా ఆలోచించి సిల్వరు గ్లాసులో టీ పోసి ఇచ్చాడు. సిల్వరు గిన్నెతో నీళ్ళు తెస్తున్నవాడి కళ్ళలోకి సూర్యకిరణాలు చురుకుగా వచ్చి పడ్డాయి. కళ్ళలో ఎర్రని మంటలు తిరిగి నట్టయింది, చీకట్లు ఆవరించాయి. నిలదొక్కుకోలేక పోయాడు.

సిల్వర్ గిన్నె సొట్టలు పడింది. అప్పలరాముడి కన్నా వీరాస్వామే ముందు చూశాడు. తన కొడుకు వల్ల తానెంత అప్రతిష్ఠ పాలవుతున్నా డన్నది ఆవేదనలో వ్యక్త పరిచి, వాడిని సంస్కరించ వలసిన అవసరం తనకెంతైనా ఉన్నదని గ్రహించి, వీధిలోనే చెరువు గట్టున రేవు పెట్టాడు వీరాస్వామి. సొమ్మసిల్లి పడి పోయాడు గన్ని. చెరువుకు నీటి కోసం వచ్చిన వారెవరో వాడి ముఖం మీద నీళ్ళు చల్లి హోటలు లోపలికి తీసుకొని వచ్చారు. అప్పలరాము డేమనుకున్నాడో, ఏమో గాజుగ్లాసుతో వేడి టీ వాడికి తాగమని ఇచ్చాడు. గన్ని నెమ్మదిగా తాగాడు. వీరాస్వామి మాత్రం అసహనంగా హోటలు వాకిట తిరుగు తున్నాడు." టిఫిని తింటావా?" అడిగాడు అప్పలరాముడు.

"నాకొద్దు. మా అయ్యకు పెట్టు" అన్నాడు గన్ని, సొట్టలు పడ్డ సిల్వరు గిన్నె వైపు చూస్తూ.

"ఆడికి టిఫినిస్తా. నీవూ కసింత తిను" అన్నాడు అప్పలరాముడు. "నా కొద్దు. సెంద్రి ఇంటికాడ పెళ్ళి భోజనాని కెళ్తా" అన్నాడు తల దించే.

వీరాస్వామి గబ గబా టిఫిన్ తినేసి వెళ్ళిపోయాడు.

ప్లేట్లు తీయడానికి కదిలాడు. ఎముకలు నలిగి పోతున్నట్టు ఒక్కసారి 'ఫటేల్' మన్నాయి. గుండె మీద బండరాయి పెట్టినట్టు, పీక నెవరో నులిమి వేస్తున్నట్టు అనిపించింది. "అమ్మా!" అన్నాడు బాధగా, కళ్ళు మూసుకుని. అప్పలరాముడు చూశాడు. వీరాస్వామి చాలా దారుణంగా వాణ్ణి చావబాదటం తనకు తెలుసు.

"నీ వీ పూట పనేటీ సెయ్యాక. ఆ పక్కనే తొంగో" అంటూ గోనె పట్టా పరిచాడు.

"ఇయ్యాల వదిలి పెట్టినప్పుడు మా తమ్ముడు నారిగా డొస్తడు. ఆడి కిది నా నిచ్చినానని ఇచ్చీ. సెంద్రి ఇంటికి నాను పోస్తను. నన్ను తీసికెల్తవా?" అడిగాడు నెమ్మదిగా మేను వాల్చుతూ. "అలాగే" అన్నాడు గన్నిగాడు తన చేతి కిచ్చిన గుడ్డసంచీ అందుకుని.

"మాటగారు రాంగనే టీ ఇచ్చి!" చెప్పాడు గుర్తుకు తెచ్చుకుని. కొద్దిసేపాగి మళ్ళా అన్నాడు: "అప్పలరాముడూ! ఇయ్యాల్టితో బాకీ తీరిపోవాది. భోజనం మానేసిన దినా లన్నిటిన్నీ లెక్కేసికో. నీకే తెలుస్తది. నాను సెంద్రక్కయ్యతో రేపు పెందిల్నే ఎల్లిపోతా."

అప్పలరాముడు వాడి మాటలు పూర్తిగా వినటం లేదు. గన్నిగాడు సన్నగా మూలుగుతూ నిద్రలోకి జారుకున్నాడు.

ఏ రోజూ మాస్టారికోసం ఎదురుచూడని అప్పలరాముడు అతనికోసం ఎదురు చూశాడు. ఆ రోజు ఆయన సెలవు పెట్టాడట. రాలేదు. ప్యూను చెప్పాడు.

మధ్యాహ్నం ఒంటి గంట వేళ గోవరాజు ఇంటికి వెళ్ళబోతూ గన్నిగాణ్ణి నిద్ర లేపాడు. "రేత్రికి ఎల్తా... ఇప్పుడు... నిద్ర..." అంటూ గన్నిగాడు పక్కకు తిరిగాడు. టీ ఇచ్చి అప్పలరాముడు, ముక్క వెళ్ళి పోయారు.

"సెంద్రి అరిసెలు, బూందీ నీ కని ఇచ్చినాది. రేత్రి ఎవలకి భోజనాలు లేవు" అంటూ పొట్లం అందించాడు వస్తూ అప్పలరాముడు.

గన్నిగాడు ఆ పొట్లాన్ని గట్టిగా పట్టుకుని మళ్ళా కళ్ళు మూసుకున్నాడు.

* * *

స్వేచ్ఛ మానవుని జన్మ హక్కు. బానిసత్వం అతడికి స్వార్థపరుడు బిగించే ఇనుప సంకెల. దాన్ని తెంచుకొని పోవా లనుకోవటమే చైతన్యానికి చిహ్నం. కాని, ఈ చైతన్యం అందరిలో ఉంటుందని అనుకోవటం మాత్రం భ్రమ.

నీలాకాశం ఎత్తుకు చొచ్చుకుని పోయిన చెట్టు చిగురు కొమ్మల వరకు ఎగిరిపో నుంకించిన గన్నిగాడి మనసు ఆ రాత్రి చంద్రి పెండ్లి వాకిలి చుట్టూ మసలుతూ ఆమెతోబాటు వెళ్ళడానికి సిద్ధమయింది.

సోమవారం రాత్రి చంద్రి పెళ్ళి అయింది. ఉదయాన్నే చంద్రి మేనాలో అత్తవారి ఇంటికి వెళ్ళిపోయింది.

ఆ రోజు చీకటి వేళ ప్రతి రోజూ లాగ అప్పలస్వామిని గన్నిగాడు నిద్ర లేపలేదు. పంతులుగారి అరుగుమీద చదువుకునే పిల్లలకు హెచ్చరికలు చేయలేదు.

పూజారయ్యగారి ఇంటి ముందు చేరి నమస్కరించలేదు.

గోవరాజు ఇంటికి చేరి పాల బిందెను అందుకోలేదు. కనీసం అప్పలరాముడినైనా నిద్ర లేపలేదు.

మేనా దగ్గరికైనా వచ్చి తనను పలకరించి, తనతో వస్తాడేమో అని ఆశగా చూసిన చంద్రి చూపులకు గన్నిగాడు ఎక్కడా అందలేదు.

నిజమే, గన్నిగాడు ఎవరి దృష్టికి అందడు.

అతడు వెళ్ళిన చోటు ఎవరైనా వూహించగలరు.

కాని, ఆ చోటు కనిపెట్టలేరు.

గన్నిగాడు అక్కడికే వెళ్ళాడు.

మరి అలాగే తెల్లవారింది. ★

## ఆవిర్భావం

**-మదిర భానుమూర్తి**

కాలి వమ్మెట దెబ్బలు
తిన్నాకనే
కావలసిన రూపాన్ని
సంతరించుకుంటుంది
అయుష్షు!
హాలాహల మథనం
చేశాకనే ఆవిర్భవిస్తుంది
అమృతం!
వ్యథాక్షుభిత
హృదయంలో నుంచే
ఉద్భవిస్తుంది
సుధామయ మధుర కవిత్వం!

*